

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# ఎంటర్‌ప్రెన్యూర్ డాట్ థాం

వీకెండు మొదలైంది.

"ఒసేవ్, ఇవాళ ఏ దిక్కుమాలిన పార్టీలన్నా వున్నాయా?" గౌరవంగా అడిగాను మా ఆడలేడీసుని.

"నన్నెవరూ పిలవలేదు. మీరేవన్నా "ఈ వైట్లు" ఒప్పుకున్నారేమో చూసుకుని చెబితే, బియ్యం పడేస్తాను.." అంది ఫేస్ బుక్ లో ఏదో వీడియో చూస్తూ.

"లేదు నాకు తెలిసి నేనా తప్పు చెయ్యలేదు. అంచేత ఇవాళ ఇంట్లోనే విస్తర. నువ్వు ముందు పప్పు చేసుకో. ఆనక కాస్త "**ఆవ**" టచ్ ఇచ్చి, కేబీజీ పచ్చిబటాణీల కూర కానియ్యి. అల్లం వేస్తే, నేతిలో వేయించి పడేయ్. మొన్న తెచ్చిన గుమ్మిడి ముక్క సరిగ్గా మూడంగుళాల ముక్కోణాలుగా కోసి, తియ్య పులుసు ఖాయం చెయ్యి, మా అమ్మ పంపించిన పచ్చి వడియాలు, కుంభకోణం వాడి అప్పడాలు ఓ స్టీలు బేసెనుడు వేయించు. పటేల్ సోదరుడిదెగ్గిర కొన్న అరిటాకు శుభ్రంగా కడిగి దానిలో వడ్డించు. అరగంటలో స్నానం చేసొస్తాను." అని లేచాను.

ఆవిడ ఫోనులోంచి మొహం బయటికి పెట్టి "ఏవిటంటున్నారూ?" అంది అమాయకంగా.

నాకు చిఱ్ఱెత్తుకొచ్చింది. అయినా తమాయించుకుని "మొత్తం మళ్ళీ చెప్పాలంటే కష్టం. నువ్వు ఎక్కడిదాకా విన్నావో చెప్పు. మిగిలింది చెప్తా"అన్నాను.

"ఇంట్లోనే విస్తర వరకు విన్నానండీ.." అంది ఫేసు ఫేసుబుక్కులో దూరుస్తూ.

నాకు మరి త్యాగరాజ కీర్తన రీమిక్స్ విన్నంతగా కాలింది. "ఒసేయ్...ముందా ఫోనిల్లా ఇవ్వు, దిక్కు మాలిన ఫేసు బుక్కూ నువ్వూను. ఏంచూస్తున్నావే అసలు" అంటూ ఆవిడ మీద పడి ఫోను లాక్కుని చూసాను. ఏదో చైనా ఆవిడ వీడియో. నెత్తి మీద ఒక పుల్ల పెట్టుకుని నేలమీంచి ఒక్కో పుల్లా తీస్తూ అన్నిటితోటీ నెత్తి మీద పందిరిలాగ కట్టి బేలన్సు చేస్తోంది, మధ్యలో ఓ కోడి ఈక పెట్టి. నాకు వళ్ళు మండి "వుఫ్" మని వూదాను. ఫోను గెట్టిగా కుదిపేసాను. అయినా బేలన్సు తప్పకుండా అన్నీ పెట్టేసి, చిటికెన వేలి గోరు మీద గోవర్ధన పర్వతంలా నిలబెట్టింది. చూస్తున్న పీనుగులంతా చప్పట్లు కొట్టేసారు. మా ఆవిడ కూడా కొట్టేసింది. వీడియో ఆగిపోయింది.

"పొద్దున్నే ఈ కోడి ఈకలు, సాము గరిడీలు ఏవిటే?" అన్నాను చిరాగ్గా.

"ఆవిడకి లక్ష డాలర్లిస్తారట బహుమతి" అంది కళ్ళు పెద్దవి చేసుకుని.

"పోన్లే, రేపట్నించీ ఆఫీసునించి వచ్చేప్పుడు నాలుగు పుల్లలు, రెండు కోడి ఈకలు తెస్తాను, నువ్వూ ప్రాక్టీసు చెయ్యి." అన్నాను ఏడిపిస్తూ.

"అవును మరి, గుఱ్ఱవల్లే కుక్కని పెంచి, దొంగలు పడితే రాజు తనే మొరిగాడుట" అలా వుంది సంబడం. ఇల్లూ నేనే చూసుకుని, పిల్లల్నీ నేనే సంభాళించుకుని, సంపాదనా నేనే చేస్తే, ఇంక మీరెందుకు, మంచానికి దిష్టి తగలకుండానా?" అంది ఉడికిస్తూ.

సామెత లో రాజెవరో కుక్కవరో అని కాసేపు ఆలోచించి, మొదటి తప్పుగా భావించి వదిలేసి, "అది సరేగానీ, వంట సంగతి విన్నావా? ముందు ముద్ద పప్పుతో మొదలెట్టు. ఇవాళన్నా కాస్త వేయించి వండు. పూర్వకాలంలో **హోమోసేపియన్ల**ని వుండే వాళ్ళు. వాళ్ళకి ఆట్టే నాగరికత తెలీక పచ్చి పప్పు వండేసుకు తినేసేవారు. ఆ తరవాత మానవ జాతి చాలా అభివృద్ధి చెందింది. మను స్మృతిలో కూడా రాశాడు కంది పప్పు వేయించకుండా తింటే **"కం"** నామ నరకానికి పోతారుట" అన్నాను వివరిస్తూ.

"అంతే. ఎంత సేపు కంది పప్పు వేయించావా? ఉప్మాలో జీడిపప్పులేసావా? అని కాల్చుకు తినేయడవే తప్ప, అసలు ప్రొఫెషనల్ గ్రోత్ చూసుకోవడం, పెద్ద జాబు కి మారడం, నాలుగు డబ్బులు సంపాదించుకోవడం, ఏ గుడ్డూ లేదు. అసలు మీలో ఆంత్ర ప్రెనూర్ షిప్పే లేదు..." అనేసింది గబగబా.

"ఆంత్ర ప్రెనూరా..అదేం షిప్పే? క్రూజ్ షిప్పా?" అన్నాను బాలుడిలా.

"మీ తలకాయ. మీకన్నా తరవాత వచ్చినవాళ్ళంతా బోల్డన్ని వ్యాపారాలు చేసి, కంపెనీలు పెట్టేసి, లక్షలు గడించి, లంకంత కొంపలు కోనేసి, సి,సి,సి.." ఆవేశపడిపోతూంటే ఆపాను.

"లంకంత కొంపలో వుండడానికి, పుష్పకవిమానంలో తిరగడానికి నేనేవన్నా రావణాసురుణ్ణా? అయినా నీ గోలేవిటే. సెలవపూట పూటుగా తిని తొంగోక , ఊ...నస.." అన్నాను.

"అంతే, ఎంతసేపూ వాతాపి జీర్ణమే తప్ప, మంచి విషయాలు బుఱ్ఱకెక్కవు. " అంది బుసకొడుతూ.

నేను కాస్త తగ్గి, జారిపోతున్న పైజమా బిగించి కట్టి "అయితే నేను ఎంటర్ ప్రెన్యూర్ అవ్వాలంటావు, అంతేనా?" అన్నాను.

"ఎంటర్ ప్రెన్యూర్ ఏవిటి, ఎంటర్ ది డ్రేగన్ లాగ, ఆంత్ర ప్రెనూర్ అనాలి..ఏదీ అనండి" అని నాచేత అనిపించింది.

"సరేలెండీ, బట్టీ పట్టేసాం. ఇంతకీ అదనపు సంపాదన వచ్చే దార్లు వెతకమంటావ్, అంతేనా? ఉజ్జోగం మారమంటావ్, ఖాయవేనా? ట్రై చేస్తాగానీ, ముందు వంట సంగతి చూడు, నేనెళ్ళి జలకాలాడి వస్తాను.." అనేసి, పైకి పోయాను.

ఆవిడ కుడిచేత్తో బుఱ్ఱ కొట్టుకుంటూ వంటింట్లోకి జంపయింది.

నా బుఱ్ఱ పాదరసంలా పనిచెయ్యడం మొదలెట్టింది. "నిజవే, ఈ దేశం వచ్చి 20 ఏళ్ళైంది. పెళ్ళాన్నీ, పిల్లలనీ తప్ప, సాధించిందేవీ లేదు. ఈలోగా ఆ రావు గాడు రెండు కంపెనీలెట్టేసి, మూడమ్మేసి, నాలుగు మేడలు కట్టేసి, ఐదు చేతులా సంపాదిస్తున్నాట్ట. ఎదవ, చిన్నప్పుడు ఎనక బెంచీలో కూచుని ఏరు సెంగపప్పుండలు తినేవాడు క్లాసులో కూర్చుని. నేనెప్పుడూ ఫష్టే. అయితే మాత్రం, ఇవాళ వాడు కోటీశ్వరుడు, మనం నందీశ్వరుడిలా, స్థిరంగా, ఎదురుగ్గా కూర్చుని ఆపర్ట్యూనిటీ కోసం ఎదురుచూడ్డవే సరిపోయింది..హు. ఆ విశ్శి గాడు, వెబ్ సైట్లు అమ్మేసి లచ్చలు సంపాదించేసాడు. ఛీ నా బతుకు, థూ..లాభం లేదు ఏదో చెయ్యాలి.." అంటూ ఉండగానే అప్రయత్నంగా పాట నోటికొచ్చేసింది "ఎవరో రావాలీ, ఈ బొజ్జని కరిగించాలి, నాకు కొత్త ఉజ్జోగం ఇవ్వాలి, లచ్చలు కురిపించాలీ...ఎవరో....రావాలీ..". అనంగానే వచ్చేసింది మా పెద్దది.

"నాన్నా, ముందు నువ్వు షవర్ లోంచి బైటికి రావాలి, లేకపోతే మాకెవ్వరికీ వేణ్ణీళ్ళు మిగలవు..." అంది అరుస్తూ. పరశు వేరు చూసిన పాములా గప్ చిప్ అయిపోయి బైటికొచ్చి, తయారై, ఏదో తిండి అయిందనిపించాను.

"పోనీ కేటరింగ్ మొదలెడదావేవిటే, చక్కగా నాలుగు రకాలు చేసుకోవచ్చు" అన్నాను మా లేడీస్ తో.

"కేటరింగ్ అంటే వండి వేరేవాళ్ళకి ఇవ్వాలి, మనం తినేయ కూడదు. అయినా, వందల మందికి వండాలంటే నడ్డి పడిపోతుంది, మీరు కనీసం కూరముక్కన్నా తరగరు, నావల్ల కాదు" అనేసి, భోజనం ముగించి, వంటిల్లు సద్దుకోసాగింది.

అలా నా కేటరింగ్ బిజినెస్ కి దెబ్బేసేసింది. "పోనీ, ఇండియా, దుబాయి మరియు సైబీరియా కు చవకగా కాలింగ్ కార్డులు అమ్ముదామా?" అన్నాను ఆశగా.

"ఎందుకూ, ఇప్పుడు స్కైపు లో అన్నీ ఫ్రీ, బొమ్మ కూడా కనబడుతుంది. ఇలాంటి పాత చింతకాయ పచ్చడి ఆలోచనలు మానేసి, ఏదన్నా కొత్తగా ఆలోచించండి." అంది గిన్నెలు కడుగుతూ.

"కొత్త కొత్తగా వున్నదీ.." అని పాడుకుంటూ మెట్లెక్కి మా పెద్ద దెయ్యం రూం లోకెళ్ళాను.

అది బుద్ధిగా ఐపేడ్ లో పాటల వీడియోలు చూసుకుంటోంది. "నాన్నా, పోనీ నిమ్మకాయ రసం అమ్ముదామా? గ్లాసుకి రూపాయి లాభం వస్తుంది. రోజుకి లక్షమంది తాగారనుకో, మనకి నెలకి ముప్పై లక్షలు లాభం తెలుసా? అంది కళ్ళు పెద్దవి చేస్తూ. ఎంతైనా నా కూతురు కదా, నా పోలికలే. ఎవర్నని ఏం లాభం. అందుకే దాన్నోమాటు దగ్గరకి తీసుకుని ఓదార్చాను.

"నా లెఖ్ఖ కరెక్టే కద నాన్నా?" అంది.

"లెఖ్ఖ కరెక్టుగానే వుంది, లక్కే దెబ్బకొట్టేహింది.." అన్నాను నిట్టూరుస్తూను.

పోనీ చిట్టీలు మొదలెట్టి, అది కాస్త పెరిగి, ఓ లక్ష డాలర్లయ్యాకా, బోర్డు తిప్పేస్తే? ఈ ఆలోచన చెప్పగానే మా ఆవిడ నా పాదపీడనం చేసి, టూత్ బ్రెష్షు పెట్టి కంట్లో పొడిచింది. ఆవిడ భావం అర్థం అయ్యి, నేను నోరు మూసుక్కూర్చున్నాను. పో...నీ..ఆడవాళ్ళ చీరలూ, కుర్తాలూ, పైజమాలు, చూడీ దార్లూ, ఇండియానించి వచ్చేవాళ్ళ చేత తెప్పించి, ఒకటికి డబల్ రేటు పెట్టేసి, అమ్మేస్తే? ఇదీ చెప్పాను లేడీస్ కి.

ఆవిడ వినంగానే "ఛీ, ఆడంగి అబ్బన్న లాగ గుడ్డముక్కలమ్ముకుంటానంటారా? మా చిన్నప్పుడు లూనా మీద చీరల మోపులు కట్టుకుని వచ్చేవాడు వీరాస్వామి. అలా అమ్ముకోవడవా? మానాన్నకి తెలిసిందంటే ఆత్మహత్య చేసుకుంటారు." అంది కోపంగా.

మన చీరల వ్యాపారం మావగారికి కొదుతుందని భయపడి వదిలేసాను.

"పోనీ ట్యూషన్లు చెప్పండి. లెఖ్ఖలు చెప్పమని బోల్డు మంది అడుగుతున్నారు కదా" అంది మా లేడీసు. అసలే మనకి తిరం తక్కువ. ఇంట్లో పిల్లలకి దిక్కులేదు బైటపిల్లలకి త్రి డి సినిమా చూపిస్తానన్నాట్ట వెనకటికెవడో. అందుకే బొజ్జ మీటుకుంటూ ఆలోచిస్తూంటే, మా పెద్ద దెయ్యం వచ్చి

"అవున్నాన్నా, నువ్వు లెఖ్ఖలు చెప్పు, నేనూ హెల్ప్ చేస్తాను" అంది.

ఆమాట వినంగానే, "మూగోడి పాటకి చెవిటోడు దరువేసినట్లుంటుందని" కించిత్తు వగచి, సున్నితంగా తిరస్కరించాను, దాని సున్నితమైన మనసు గాయపడుంటుంది.

అది, "మీఖర్మ" అన్నట్టు ఓ చూపు చూసి సైకిల్ తొక్కుకోడానికి పోయింది.

ఇంతలో చిన్న దెయ్యం లేచి "నా....న్నాఆ.." అని ఒక రంకె పెట్టింది. మరుక్షణం లో పైకెళ్ళి మధ్యాహ్న సేవలు చేసి దాన్ని కిందకి తెచ్చాను. అప్పుడొచ్చింది మెరుపులా ఒక ఆలోచన.

"డాడీ డే కేర్" పెట్టేయనా పోనీ? అన్నాను.

"అప్పుడు మా అమ్మ ఆత్మహత్య చేసుకుంటుంది" అంది కోపంగా.

"ఐయితే, మంచి రోజు చూసుకుని మొదలెట్టనా" అని అడిగాను వెంటనే.

ఒక్క మొట్టికాయ మొట్టి "ఛంపుతాను"అంది వచ్చే నవ్వు ఆపుకుంటూ, లేని కోపం తెచ్చుకుంటూ.

"పోనీ మనిద్దరం వెబ్ సైట్ లో వేలానికి చెరికో కిడ్నీ అమ్మేసి, వచ్చిన డబ్బుతో ఒక గేస్ స్టేషన్ కొనేద్దాం" అన్నాను ఆశగా.

"కొంటాం సరే, మరి ఆ గేస్ ష్టేషన్ సరిగ్గా నడవకపోతేనో?" అంది మా ఆవిడ సాలోచనగా.

"ఏవుందీ. మళ్ళీ గేస్ స్టేషన్ అమ్మేసి, మన కిడ్నీలు మనం తెచ్చేసుకోవడమే" అన్నాను మామూలుగా.

అవిడ తలకొట్టుకుంటూ పిల్లని తీసుకుని పైకెళ్ళింది నడుం వాల్చడానికి. నా బుఱ్ఱ ఎక్కడా ఆగట్లేదు. కాసేపు ఆవకాయల బిజినెస్ చేసింది. దాంట్లో ఏవో జీవాలు కనబడడం వల్ల ఈ దేశంలో అధికారులు నాకు భారీ జరిమానా లేదా మరియు జైలు శిక్ష వేసిన కారణాన అగి ఆగిపోయింది. ఆనక ఇళ్ళు కొనుట మరియు అమ్ముట అనే వ్యాపారం చేసింది. నాలుగు లోనులు పెట్టి రొండు బొమ్మరిల్లులు కొంది. ఒకదానిలో అద్దెవాడు మందుల తయారీ కంపెనీ పెట్టాడు. రెండో ఇంటివాడు రోజూ పెళ్ళాన్ని కొట్టడంతో, ఓ రోజు అది వాడి పీక పిసికేసింది. అక్కడ ఇప్పుడంతా పోలీసుల మయం. దాంతో ఆబిజినెస్ హుష్ కాకి. బంగారం బిస్కెట్లు కొని దాచి, రేటు పెరిగాకా అమ్మే బిజినెస్ చేసింది. ఒక పట్టపగలు ఇద్దరు చీకటి దొంగలు డిటెక్టర్ పుచ్చుకు వచ్చి, నేరుగా బిస్కెట్లు తీసేసుకుని, ఫాస్ట్ గా కారెక్కేసి వెళిపోయారు. దాంతో మన బంగారం మంచిది కాదని తేలిపోయింది. ఆనక ట్రావెలింగు జాబ్ చేసింది, పిల్లలూ పెళ్ళావూ బెంగెట్టేసుకుని చిక్కి సగమైపోయి, నేను హోటల్ తిండి పడి బలిసి రెండైపోయి, లంక మేత గోదారి ఈత లా, సంపాదించిన డబ్బు సొంతం విమానాలకు పోసి, ఆరోగ్యం అర సగమైపోయి, అలా అదీ ఆగిపోయింది.

ఇంక ఆలోచించే ఓపిక లేక నేనూ పైకెళ్ళి మంచం మీద ఓ మూలగా నడుం వాల్చాను. ఎంత ఆలోచించినా డబ్బొచ్చే మార్గం కనబడలేదు. నిద్ర పట్టలేదు. అటూ ఇటూ దొర్లుతున్నాను అక్కడక్కడే. పిల్లని పడుకోబెట్టి పక్కన చేరింది పెళ్ళం.

"ఏవండీ" అంది మెల్లిగా.

"ఆ చెప్పు" అన్నాన్నేను దిగులుగా.

"ఊరికే అన్నానండీ. మనకెందుకొచ్చిన వ్యాపారాలు. పిల్లల చదువులకి డబ్బు బేంకులో వేస్తున్నాము. మరో పదేళ్ళలో ఇల్లు విడిపించేసుకుటాము. చిన్నదో, పెద్దదో ఒక ఉజ్జోగం వుంది. నెల తిరగ్గానే వాడు డబ్బులు జమ చేసేస్తాడు. అవసరమైన మేరకు ఖర్చు పెట్టుకుంటున్నాం, నాలుగు రకాలూ చేసుకు తింటున్నాం. ఇంతకన్నా ఏం కావాలండీ? ఆ డబ్బులూ వద్దు, వాటితో వచ్చే జబ్బులూ వద్దు. ఇలాగే బావుంది. అప్పుడప్పుడూ ఓ మాటు, ఏదో, అలా అనిపిస్తుంది. మళ్ళీ అదే తగ్గిపోతుంది. ఈ వెఱ్ఱికి అంతెక్కడా?" అంది నవ్వుతూ.

"అంతే అంటావా?" అన్నాను అనుమానంగా. అవునన్నట్లు తల ఊపుతూ అంది

"సాయంత్రం పెసరట్లు పోస్తున్నాను. మన విస్సు గారు, అన్నపూర్ణ వాళ్ళని పిలవండి".

"పిలుస్తాను గానీ, నాకు మాత్రం ఉల్లిపాయలు, జీలకర్ర, నెయ్యి ఎక్కువ వెయ్యాలి.." అన్నాను నిద్రలోకి జారుకుంటూ.

మా లేడీసు నవ్వింది "అలాగే, తమరి చిత్తం" అంటూ.

★★★

# COMMENTS